నిర్మాణ పనులతో నిత్యం ఇబ్బందులు

అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ కాలుష్యాన్ని అరికట్టాలని ఆయా అపార్టుమెంట్‌వాసుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న నివాసితులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ కన్‌స్ట్రక్షన్స్‌తో వచ్చే కాలుష్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ అపర్ణ సరోవర్, అపర్ణ గ్రాండే, అపర్ణ జెన్నిత్ సముదాయాలలో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్, కార్పొరేట్ ఉద్యోగులు తదితరులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేపట్టిన నిర్మాణాలతో నిత్యం ఇబ్బందుల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి, పగలు తేడా లేకుండా సెల్లార్ల పనులు చేస్తుండటంతో రాత్రి వేళ శబ్దాలతో నిద్రపోలేక పోతున్నామన్నారు. అదే విధంగా సెల్లార్లు తవ్వే సమయంలో వచ్చే డస్ట్ విపరీతంగా ఉంటుందని, చుట్టూరా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు తవ్వేటప్పుడు వాటర్ చల్లడం ద్వారా డస్ట్ లేవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో శబ్దాలు రాకుండా చూడాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అపర్ణ సరోవర్, అపర్ణ గ్రాండే, అపర్ణ జెన్నిత్ నివాసితులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్


మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

మియాపూర్: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తానని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎంఏనగర్ కాలనీలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి బస్తీలో పర్యటించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కో ఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, నాయకులు ఇలియా షరీఫ్, వీరేందర్‌గౌడ్, సంజీవ్‌రెడ్డి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలనీలో సమస్యల తిష్ట



- కనీస సౌకర్యాలూ కరువే
- ఇబ్బందుల్లో ప్రజలు

జిన్నారం(పటాన్‌చెరు): బీసీ కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. ఏళ్లుగా కనీస సౌకర్యాలు లేక ప్రజలు సతమతమవుతున్నారు. మున్సిపాలిటీకి ఆదాయం ఉన్నా గానీ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు అశ్రద్ధ వహిస్తున్నారని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో గల బీసీ కాలనీలో తాగు నీటి సౌకర్యం లేదు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇప్పటి వరకు కొత్త రోడ్డు కూడా వేసిన దాఖలాలు లేవని వాపోతున్నారు. ఇక అంగన్‌వాడీ, పీహెచ్‌సీ కేంద్రాలు అందుబాటులో లేవు. కానీ బొల్లారం మున్సిపాలిటీకి ఏటా రూ.12 కోట్లు ఆదాయం గడిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలను కూడా ప్రకటిస్తుంటుంది. 22 వార్డులుండగా మున్సిపాలిటీలో 3 వేల మంది జనాభా నివసిస్తున్నారు. అయితే 2వ వార్డులో ఉన్న బీసీ కాలనీ అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకులు, అధికారులు ఈ కాలనీపై చిన్నచూపు చూస్తున్నారని వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. బీసీ కాలనీలో సత్వరమే పర్యటిస్తా. సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపడతా.
– మంగతాయారు, మున్సిపల్ కమిషనర్

నిధుల కోసం పోరాడుతున్నాం



మా కాలనీ అభివృద్ధికి అధికారులు, పాలకులు నిధులు కేటాయించటం లేదు. మున్సిపల్ సమావేశంలో నిధులు కేటాయించాలని ఆందోళన చేస్తూనే ఉన్నాం. కలెక్టర్ స్పందించి నిధులు కేటాయించాలి.
– గోపాలమ్మ, కౌన్సిలర్

ఇబ్బందులు పడుతున్నాం




తాగునీరు, రోడ్డు సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. సమస్యలు పరిష్కరించటంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికారులు అయినా స్పందించి చర్యలు తీసుకోవాలి.
– లక్ష్మి, కాలనీవాసి

పూరీ జగన్నాథ్ ఆలయంలో విద్యార్థులు

బంజారాహిల్స్: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్షలు ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా జూబ్లీహిల్స్ భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమం పదో తరగతి విద్యార్థులు బంజారాహిల్స్‌లోని పూరీ జగన్నాథ్ టెంపుల్‌ను ఆదివారం సందర్శించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన విద్యార్థులకు అర్చకులు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా వారు పరీక్షల్లో మంచి మార్కులు రావాలని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సూచించారు.

స్కేటింగ్‌లో 'గోల్డ్'

పోటీకి దిగితే బంగారు పతకమే..
నేషనల్స్‌కు ఆడటమే తన టార్గెట్ అంటున్న తేజస్వరి


ప్రాక్టీస్ చేస్తున్న తేజస్వరి


తేజస్వరిని అభినందిస్తున్న బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు

శేరిలింగంపల్లి: చదువుతో పాటు స్కేటింగ్ లోనూ రాణిస్తోంది తేజస్వరి. స్కేటింగ్‌లో ఆమె ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. ఏడేళ్ల వయస్సు నుంచే స్కేట్ 9 అకాడమీలో కోచ్ విఠల్ ఆధ్వర్యంలో స్కేటింగ్‌లో శిక్షణ తీసుకుంది. జాతీయస్థాయిలో జరిగిన అనేక పోటీల్లో పాల్గొని పలు పతకాలను సాధించింది. వివరాల్లోకి వెళితే... నల్లగండ్లలో నివాసం ఉండే జి. శ్రీనివాస్, శ్రీదేవి దంపతుల కుమార్తె తేజస్వరి చందానగర్‌లో ఇంటర్ చదువుతోంది. రాష్ట్ర, జాతీయ స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటూ అనేక విజయాలు సొంతం చేసుకొని పలువురి మన్ననలను పొందుతోంది.

దేశం తరపున ప్రాతినిధ్యం వహించాలన్నదే లక్ష్యం..

జాతీయస్థాయి పోటీల్లో సీనియర్స్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించడమే నా లక్ష్యం. ముమ్మరంగా ప్రాక్టీస్ చేస్తున్నా. అంతర్జాతీయ పోటీల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తా. స్కేట్ 9 అకాడమి కోచ్ విఠల్ ఉప్పలూరి వద్ద శిక్షణ తీసుకుంటున్నా. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని దేశానికి పతకాలు తేవాలన్నదే లక్ష్యం.
– తేజస్వరి, స్కేటింగ్ క్రీడాకారిణి



సాధించిన పతకాలు..

- 2016లో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్‌ఎస్‌ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బెంగుళూరులో నిర్వహించిన పోటీల్లో పాల్గొని రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించింది.
- 2017లో ఆర్‌ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో చెన్నైలో జరిగిన పోటీల్లో గోల్డ్ మెడల్
- 2018లో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ మెడల్
- 2019లో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 2 గోల్డ్ మెడల్స్
- 2023 చెన్నైలో ఆర్‌ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది.
- అదేవిధంగా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గావిలో 2016, 2017, 2019లో జరిగిన పోటీల్లో పాల్గొని మూడు సంవత్సరాలు గోల్డ్ మెడల్ సాధించింది.

ట్రేడ్ యూనియన్ కార్యాలయం ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులను కలిగి ఉంటే ప్రభుత్వపరంగా సంక్షేమ పథకాలకు అర్హులని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీలో భవన నిర్మాణ కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్యాలయంను రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, పలువురు నాయకులు, భవన నిర్మాణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బస్తీదర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ కాలనీలో ఆదివారం బస్తీదర్శన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళతానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్ యాదవ్, రాజ్‌కుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

అన్నదానం

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి మండల పూజలో భాగంగా పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని శ్రీ రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం ఉదయం 6 గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం శివ స్వాములకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసుల దాడులు

12 పెద్ద సిలిండర్లు, 9 చిన్న సిలిండర్లు, 2 వెయింగ్ మిషన్లు స్వాధీనం

పటాన్‌చెరు: గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసులు దాడి చేసి సిలిండర్లు, వెయింగ్ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. ఇస్నాపూర్ చౌరస్తా నుండి పాశమైలారం వెళ్లే దారిలో అక్రమ రీఫిల్లింగ్ కేంద్రంపై పోలీసులు ఆదివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 12 పెద్ద సిలిండర్లు, 9 చిన్న సిలిండర్లు, 2 వెయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకొని, అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్‌కు పాల్పడుతున్న మహ్మద్ గౌస్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

చిత్రలేఖన పోటీలు


పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ భద్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం బీహెచ్‌ఈఎల్ కమ్యూనిటీ సెంటర్లో గృహ భద్రత, రహదారి పద్ధతిపై రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ భద్రత మండలి తెలంగాణ చైర్మన్ రాజగోపాల్‌రావు మాట్లాడుతూ చిన్నారులకు రోడ్డు భద్రత గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో భెల్ జీఎం విజయసాగర్, అరవింద్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అధికారి మయబ్రహ్మ, కమ్యూనిటీ సెంటర్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో బ్రెడ్ల పంపిణీ


ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రెడ్ పంపిణీ చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: అఖిల భారత ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షులు కొలుకురి నర్సింహారెడ్డి, నాయకులు పంపిణీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డా.సంజీవ రెడ్డి ఆధ్వర్యంలోకార్మిక హక్కుల కోసం పాటుబడుతామన్నారు. కార్మిక నాయకులు చంద్రమౌళి, నాగరాజు గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, బోజరాజు, రతన్‌సింగ్, కాంగ్రెస్ నాయకులు సామయ్య ,హమీద్ కిషన్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా ఈదమ్మ, ఎల్లమ్మ బోనాలు


మూసాపేటలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మూసాపేట: మూసాపేటలో ఈదమ్మ, ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజల అనంతరం మైసమ్మ తల్లి, ఈదమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నోముల సుందర్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సలహాదారులు స్వామి, రాజు, యాదయ్య, శంకర్, కోశాధికారి ప్రవీణ్, నరేష్, శ్రీశైలం, శేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణ, బాబు, మల్లేష్, అశోక్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

తులసీనగర్ సంక్షేమ సంఘం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ తులసీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో మూడవసారి అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సిహెచ్‌య శ్రీనివాస్ జనరల్ సెక్రటరిగా ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీ సిద్ధారెడ్డి, ట్రెజరర్‌గా శంకర్‌రావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి పాటుపడతామన్నారు.



'మానవ హక్కులను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు'

మోతీనగర్: మానవ హక్కులను కాపాడటంలో ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ మిషన్ ఎప్పుడు ముందుంటుందని ఆ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి అన్సర్ మహ్మద్ మట్లాడుతూ... ఏ రంగంలోనైనా మానవ హక్కుల కోసం ప్రభుత్వాలే కాదు స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేయాలన్నారు. త్వరలో మోతీనగర్‌లో ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ మిషన్ ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. మానవ హక్కులను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రేష్మా, ఎండీ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.


ఉమెన్ రైట్స్ సోషల్ జస్టిస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కులగణన తీర్మానం చేశారని, అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. నల్లగండ్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బీసీ ఐక్య వేదిక నాయకులతో కలిసి వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కులగణనకు శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. కార్యక్రమంలో వీరేందర్‌గౌడ్, బేరి రాంచందర్ యాదవ్, ఆర్‌కె సాయన్న ముదిరాజ్, రమేష్ యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, నర్సింహులు ముదిరాజ్, మక్బూల్, నవాజ్, తిరుపతి, సెల్వరాజ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా హెల్త్ క్యాంప్


బీపీ చెక్ చేసుకుంటున్న రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: ఉచిత హెల్త్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని రఘునాథ్ ఫౌండేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం సిద్ధిఖ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో హోలిస్టిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. వివిధ రకాల పరీక్షలు చేశారు. దాదాపుగా 500 మంది ఉచిత హెల్త్‌క్యాంప్‌లో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోజీ, స్థానికులు లక్ష్మీబాయి, కొండల్‌రెడ్డి, నందు, గణేష్ యాదవ్ పాల్గొన్నారు.

రంగనాథస్వామికి పల్లకీసేవ



రాయదుర్గం: రంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ఆలయంలో బాలబోగం, అర్చన, బలిహరణ, ఆరాధన తదితర పూజలను నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవతో పాటు స్వామివారికి వాహనసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు డిజిటల్ తరగతులు


డిజిటల్ విధానంలో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

మూసాపేట: ప్రభుత్వ పాఠశాలలు టెక్నాలజీని ఉపయోగించుకొని అత్యుత్తమ మార్పులు సాధించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తారని ఉపాధ్యాయులు అంటున్నారు. మూసాపేటలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో డిజిటల్ క్లాసులు విద్యార్థులు వింటున్నారు. ఫ్లాట్ ప్యానల్‌లో ప్రభుత్వ పదో తరగతి విద్యార్థులు పాఠాలు వింటున్నారు. మధ్యలో స్క్రీన్ ఉండి రెండువైపులా బోర్డు ఉంటుంది. స్క్రీన్‌లో వైఫై ఉపయోగించి యూట్యూబ్ పాఠాలు చెప్పవచ్చు. మళ్లీ స్క్రీన్‌పై రాసి వివరించి చెప్పవచ్చు. స్క్రీన్‌పై డిస్‌ప్లే అవుతూనే పక్కన బోర్డుపై కూడా రాస్తు వివరించవచ్చు. పదో తరగతి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల ఉపాధ్యాయులు అంటున్నారు. డిజిటల్ క్లాసులు బాగున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. పాఠశాలలో మొత్తం 3 ఫ్లాట్ ప్యానల్, 4 ఎఈడీ టీవీలు డిజిటల్ క్లాసుకు ఉన్నాయని అంటున్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, బండి మధుసూదన్‌రెడ్డి

మూసాపేట: రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్‌లో ఆదివారం సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం నిర్వహించారు. 150 మంది నివాసితులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు పాల్గొని రక్తదానం చేసిన వారికి ప్రశంస పత్రాలు అందజేశారు. సామాజిక సేవలో గేటెడ్ కమ్యూనిటీలు ముందుండటం గర్వించదగిన విషయమని ఆయన కొనియాడారు. కార్యనిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు. జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అల్లూరి శివప్రకాష్, ఉప ప్రధాన కార్యదర్శి నామినేని శ్రీనివాస్, టి.రామ్, కిరణ్, ప్రమోద్‌రెడ్డి, ఆర్వ ప్రసాద్, వంశీ, శ్రీపాద్, గాంధీ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఏవీబీపురంలోని కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువీకరణ పత్రాలు, కుట్టుమిషన్లును ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్డు స్వచ్ఛంద సంస్థ ద్వారా మహిళలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలన్న ఉద్దేశంతో వారికి ఈ విధంగా తోడ్పాటును అందిస్తున్నందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్డు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు సుమన్, కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంతోష్, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, బొట్టు విష్ణు, దారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేక్ లేకుండా..


ఆదిబట్ల వద్ద సర్వీసు రోడ్డు


ప్రమాదకరంగా పెద్దగోల్కొండ వద్ద ఔటర్ సర్వీసు రోడ్డు

శంషాబాద్ రూరల్: ఓఆర్ఆర్ మార్గంలో ఉన్న సర్వీసు రోడ్లలో స్పీడ్‌బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన కూడళ్లు, అండర్‌పాస్ ప్రాంతాల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శంషాబాద్, మహేశ్వరం మండల పరిధిలో ఉన్న ఔటర్ రింగు రోడ్డు సర్వీసు రోడ్లల్లో ఇరువైపులా గతంలో వాహనాల వేగ నియంత్రణకు స్పీడు బ్రేకర్లు ఉండేవి. కొన్నాళ్ల కిందట వీటిని ఒక్కొక్కటిగా తొలగించారు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. మరికొన్ని సందర్భాల్లో అతి వేగంతో

ఔటర్ సర్వీసు రోడ్లలో ప్రమాదాలు

అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువల్లో పడిపోతున్నాయి. వీటి కారణంగా కొన్నిసార్లు వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రధాన కూడళ్లలో..

ఔటర్‌పై ఉన్న ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా మార్గాల్లో వచ్చే వాహనాలు మితిమీరిన వేగంతో వస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. పెద్ద గోల్కొండ, తుక్కుగూడ, ఆదిబట్ల, టోల్‌గేట్ల ప్రాంతాలు, అండర్‌పాస్‌ల వద్ద భారీ వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

పెరిగిన ట్రాఫిక్..

ఔటర్ సర్వీసు రహదారుల్లో వాహనాల రద్దీ పెరిగింది. ముఖ్యంగా భారీ వాహనాలు, ట్రక్కులు రాకపోకలు చేస్తున్నాయి. ఈ మార్గాల్లో స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో ద్విచక్ర, కార్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సర్వీసు మార్గాల్లో వేగ నియంత్రణతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.